# ★ కమల



శ్రీ కొత్త రామలింగయ్యగుప్త

భాస్కరరావు, కమల, మేనత్త మేనమామ బిడ్డలు. బాల్యమునుండి వొకచోట పెరిగారు. కమలకంటె భాస్కరుడే పెద్దవాడు. ఏ పనిచేసినా, యే యాట యాడినా వొకరినొకరు విడిచిపెట్టి ఉండేవారు కారు బొమ్మరిల్లుకట్టి బొమ్మలపెండ్లిండ్లు చేయుచు అప్పుడప్పుడు తమ పెండ్లిండ్లుకూడా చేసుకుంటూ ఉండేవారు. కమల పెండ్లికూతురులా తలవంచుకొనటం, భాస్కరుడు పెండ్లికొడుకులా తలంబ్రాలు పోయటం. పగలంతా యిలా ఆటలాడి రాత్రి భోజనంచేశి వెన్నెలలో మంచాలువేసుకొని వింతవింత కథలు చెప్పుకుంటూ పరుండేవారు. వాళ్ల మైత్రిచూచేవారికి చాలా ముద్దుగా వుండేది "ఏమే! కమలా బావను పెండ్లి చేసుకుంటావా" అని నవ్వుతూ, వాళ్ల నాయనమ్మ అనేది. బావ చాలా మంచివాడు బావనే పెండ్లి చేసుకుంటాను, యేంబావా! అని కమల అంటూ యుండేది. భాస్కరుడు చిరునవ్వు నవ్వేవాడు.

ఇది భాస్కరునకు పండ్రెండు సంవత్సరములు కమలకు యెనిమిది సంవత్సరములు వున్ననాటిమాట,

భాస్కరుని జననీజనకులు యిప్పుడు కాకినాడలో వున్నారు. ఇతనినికూడా అక్కడకు తీసుకొని వెళ్ళి నాల్గవఫారములో ప్రవేశపెట్టినారు. భాస్కరుడు కాకినాడలో వున్నా, మనస్సంతా అగ్రహారంలోనే ఉండేది. అప్పుడప్పుడు ఆమెను చూడడానికి వస్తూయుండేవాడు. కాని యెక్కువ రోజులు వుండుటకు వీలు చిక్కటలేదు. భాస్కరుడు రావటంతోనే కమల ముఖం వికసించేది. భాస్కరుడు వచ్చినప్పుడల్లా కాకినాడలో జరిగిన సంగతులు, యింకా వింత వింత కథలు చెప్పి కమలనునవ్వించేవాడు. భాస్కరుడు వెళ్లుచున్నాడంటే కమల ముఖం వికళించేది. "ఇంకా రెండు రోజు లుండు బావా!" అని బ్రతిమాలుకొనేది. భాస్కరునకు వుండాలని మనస్సులో యెంతవున్నా, వాళ్ల నాన్న వుండనిచ్చేవాడు కాడు.

ఈలా కాలం గడచిపోతోంది.

భాస్కరున కిప్పుడు పదహారేండ్లు నిండాయి. స్కూలుఫైనల్ పరీక్షకువెళ్లి శెలవులలో మేనమామ గారింటికి వచ్చేడు. కమల కిప్పుడు పదునొకండేండ్లు గడచి వస్తున్నాయి. భాస్కరుని రాకచే కమల కెక్కడలేని యానందం వచ్చింది. భాస్కరుఁ డామె కనేక కథలు చెప్పి నవ్వించటం మొదలుపెట్టేడు. అతనికి ప్రేమంటే యేమిటో కొద్ది కొద్దిగా తెలుస్తూ వచ్చింది. కమల తన్ను పెండ్లిచేసుకొంటే యెంతో బాగుండునని యనుకొనేవాడు. ఇందులకు కమల సమ్మతించునేమో యని తెలిసికొనుటకు కుతూహలపడేవాడు. కాని తెలిసికొనుటకు మార్గ మెట్లో తెలియదు పాపము.

ఒకనాడు వెన్నెలలో మంచము వేసుకొని పండుకొని యనేక సంగతులు చెప్పి నవ్విస్తూన్నాడు. తన మనోభావమును చెప్పాలని నిశ్చయించుకొన్నాడు. "కమలా! విజయనగరంలో వొక కుఱ్ఱాడున్నాడు అతడు తన మేనమామ కుమార్తెను పెండ్లి చేసుకోవలయు ననుకొని ఆ సంగతి అంతా ఆ అమ్మాయితో చెప్పితే, ఆ పిల్ల సమ్మతించలా. ఆ యబ్బాయి చాలా విచారంతో వున్నాడు పాపము," అని అన్నాడు భాస్కరుడు దీనంతో, కమల మనస్సు యెట్టిదో తెలిసికొంటానికి.

"ఎందుకు విచారించటం! పనిలేకపోతే సరి" అని యన్నది కమల వెంటనే. కమలయొక్క వుద్దేశ్యము భాస్కరునికి సరిగా భోదపడలేదు "కమలా! నిన్నొక్కటడుగుతాను చెప్పతావా?" అన్నాడు భాస్కరుడు మెల్లగా,

"అడుగు, నాకు తెలిస్తే చెప్పుతా" అన్నది కమల.

"చెప్పుతానని ఒట్టు వేస్తే చెప్పుతాను"

"కమల అల్లే చేశింది." మన మిద్దరం పెండ్లి చేసు—కుం......"

"ఏమిటి బావా! యీమాటలు! యిలాంటి మాటలు అంటే నేను వెళ్ళిపోతాను" అని కమల నొక్కినవ్వు నవ్వింది. కమల వుద్దేశ్యం భాస్కరునికి తెలియలా. ఆ ప్రసంగమునుండి మరోదానికిమార్చివేద్దా మనుకొన్నాడు

"కమలా! ఈవేళ నా దగ్గర పండుకోవూ?"

తన తల్లి కోపపడుతుందని కమల వప్పుకోలేదు. ఒకరి నొకరు పలుకరించకుండా అల్లే పండుకొని యున్నారు. ఇంతలో, కమలా అని యెవరో పిలిచారు.

"నువ్వు వట్టి పిచ్చిబావవు" అని కమల భాస్కరుని చెంపపై నొక చిన్న దెబ్బవేశి నవ్వుతో పలాయన మయింది. భాస్కరుని కా దెబ్బ స్వర్గతుల్యంగా వుంది.

పదిహేను రోజులుండి భాస్కరుడు కాకినాడ వెళ్లి పోయేడు. పరీక్షా ఫలితాలు తెలియటం తోడనే కమలకు స్కూలు ఫైనల్ ప్యాసయినానని జాబు వ్రాశాడు. కమల మిక్కిలి సంతోషించింది. భాస్కరుడే తనకు భర్తగా కావాలని తలంచేది. భగవంతుని ప్రార్థించేది. ఎటువంటి గొప్ప సంబంధాలు వచ్చినా "పిల్లవాడు బాగుండలేదు, నేను చేసుకోను" అంటూ యేవో వంకలు పెట్టుతూ వచ్చేది.

కమల కప్పుడు పెండ్లియీడు వచ్చింది. శరభయ్య గారికి తన మేనల్లుని కిచ్చి పెండ్లిచెయ్యవలె ననే యున్నది, కాని సుశీలమ్మగారు సాగనిచ్చిందికాదు. ఆడపడుసు బిడ్డ తన కల్లుడైతే పెత్తనమంతా ఆడబిడ్డే సాగిస్తుం దను భయముతో కమలను భాస్కరునికిచ్చి పెండ్లిచేస్తే ప్రాణాలు విడుస్తానని గట్టి పట్టు పట్టింది. శరభరాజుగారి కేమీ పాలుపోలా.

సుశీలమ్మగారి సోదరుడు పిఠాపురంనుంచి యొక సంబంధం తీసుకువచ్చాడు. పిల్లవాడు మూడవఫారం వరకు చదివి మానివేశేడు. ప్రస్తుతం యింటివద్దేయుంటూ న్నాడు. వాళ్లకు తక్కువ యేమీ లేదు భూములమీద ఆదాయం బాగానే వస్తుంది. పిల్లవానిపేరు ప్రభాకర రావు. ఈ సంబంధం సుశీలమ్మకునవచ్చింది. శరభరాజు గారు వొప్పుకు తీరవలశింది.

పెండ్లి ముహూర్తం నిశ్చయించారు. కమల యవస్థ వర్ణించడానికి వీలులేకుండా వుంది. బావనే చేసుకోవల యునని బాగావుంది. పాపము చెప్పడానికి సిగ్గు. ఒక నాడు తల్లి తలదువ్వి జడవేస్తూంటేవిచారంతో "నాకా మొగుడు వద్దు" అన్నది కమల నెమ్మదిగా. "వచ్చినవారి కల్లా యిలా వంకలుపెట్టి యింకా యెవరిని చేసు కొంటావు" అని కసిరింది, సుశీలమ్మగారు. "బావ వున్నాడు కదా!" అంది కమల మెల్లగా. ఈ మాటలకు మండి పడింది సుశీలమ్మ.తలవాచేటట్టు చీవాట్లు పెట్టింది. పాపము కమలకు విషమావస్థ వచ్చింది. చిన్నినాటినుండి తనతో నాడుకొనిన బావ, వింత వింత కథలు చెప్పి నవ్విస్తూంటే బావ తనకు దూరమగుచున్నాడని కుల్లికుల్లి యేడుస్తూ వుండేది. తనకు బావే భర్తగాని తదితరుల కెంతమాత్రము హక్కు లేదనుకుంది. ఇలా వుండగా పెండ్లి రోజు వచ్చింది. శరభరాజుగారి యిల్లు బంధు మిత్రులతో కళ కళ లాడుతోంది. భాస్కరరావు పెండ్లికి రానేలేదు. తమ కుమారునికి చేసుకోలేదని కాకినాడవార్కి కోపం వచ్చింది. పెండ్లికి వెళ్లకూడ దనుకున్నారు.

ఏలాగయితే కమలకు పెండ్లి అయిపోయింది. కాల వశమున కమల భర్తకు టైఫాయిడ్ జ్వరము ప్రవేశించింది. మూడు మాసములు తీసుకొని మద్రాసులోనే చనిపోయాడు పాపము. నవరూప తేజోవిరాజిత యగు కమల తన లావణ్యమును గోలుపోయింది. సుఖదేవత యామెను దిరస్కరించినది, దరిద్రదేవత నామెను యాశ్రయించినది. సుశీల కమలను యేవిధమైన ఆలంకారములను చేసుకో నిచ్చేది కాదు. ధరించుకోటానికి కోరామల్లు యిచ్చింది.తల అట్టలుకట్టి చీకాకుగావున్నను, నూనె రాసుకోవటానికి నోచుకోలేదు పాపము. చివరకు రవికె తొడుగుకొనుటకుకూడా ప్రాప్తిలేదా పిల్లకు నవమాసములు మోసి కన్నతల్లికదా, యిట్లు హింసించునా యని ప్రశ్నింతురేమో! హిందూ సాంప్రదాయ మనే పిశాచ మామెయందు మూర్తీభవించింది. ఆ పిశా

చము యెవరి నాశ్రయించునో వారికి కన్నబిడ్డయనియు, కుమార్తె యనియు దయా దాక్షిణ్యము లుండవు. ఏ శాస్త్రములోనూ యిట్లు హింసించవలెనని లేకున్నను, యిది హైందువుల మూఢాచారమై యున్నది. పాప మా పిల్ల తన కురులకైనా నూనె రాసుకొనుట కంగీకరించ వలసినదిగా తల్లిని ప్రార్థించుచుండేది. తన జీవితము దుఃఖజనకమైనది కదా యని గది తలుపు మూసుకొని కుళ్లి కుళ్లి యేడ్చుచుండేది. నిలువుటద్దములో తన వికృతాకారమును జూచుకొని చనిపోవాలనుకొనేది.

ఈ స్థితిలో భాస్కరుడు స్ఫురణకు వచ్చేవాడు. తాము చిన్నతనములో నాడుకొనిన యాటలు మొదలైనవి యన్నియు జ్ఞప్తికి వచ్చేవి. నేత్రముల వెంట నీరు గిర్రున తిరిగేది. భాస్కరుని మనసార వివాహమాడి అతని ధర్మపత్ని యనిపించుకొను భాగ్య మామెకు లేక పోయినను, కండ్లార నాతని నొక సారి చూడవలెనని యనుకొనేది.

కాలచక్రం యిలా తిరుగుతోంది! ఏది యెట్లున్నను దాని పని అది మానదుకదా!

భాస్కరరావు బి. ఎ. పరీక్షలు పూర్తికాగానే కాకినాడకు బయలుదేరి తన మేనమామగారింటికి వెళ్లాలని నిశ్చయించుకొని రాజమండ్రిలో దిగి పెద్ద స్టీమరు మీద బొబ్బర్లంకకు వెళ్లి అగ్రహారం పోయే కారు యెక్కాడు. కమలను చూడవలయుననే యాతని ముఖ్యోద్దేశము.

భాస్కరుని రాకకు కమల ముఖము వికసించింది. తనకీ జన్మమున తుది కోరిక యేదో యా కోరిక నెరవేర్చినందులకు భగవంతుని యెంతో పొగడింది. భాస్కరునకు కమల కనబడలేదు, కాని కమల భాస్కరుని మనసార చూచింది గది కిటికీలో నుంచి. భాస్కరుడు స్వతంత్రించి, కమల గదిలోకి వెళ్లి "ఏమే కమలా! మరచిపోయేవా?" అని అన్నాడు. కమలకు దుఃఖమాగలేదు. చిన్ననాటి సంగతులు తలపుకు వచ్చాయి ప్రస్తుత స్థితినిగూర్చి వెక్కివెక్కి యేడ్చింది. కొంత బిడియం పోయిన పిదప తాను భాస్కరు నెట్లు ప్రేమించినదియు, తన పెండ్లి యెట్లునదియు తన భర్త మరణించుటయు, భర్త చనిపోయినతరువాత తల్లి యెట్లు హింసించుచున్నదియు మొదలుగాగల విషయములు కమల యేడ్చుచునే చెప్పింది. కమలకుదనపై అంత ప్రేమ యున్నందుకు భాస్కరుడు చాలాసంతోషించాడు. రెండుగంటల సేపు యేమిటో చెప్పి యామె నోదార్చాడు. భాస్కరుడు అతి రహస్యముగ సంభాషించుటచే మాకా సంభాషణ యేమిటో తెలియలా. మరునా డతడు కాకినాడ వెళ్లిపోయాడు. ఇప్పుడెందుచేతనో గాని కమల ధైర్యంగా వుంది. తల్లి ఎంత హింసించుచున్నా సహించుకొనుచుండేది. దినములు ఎక్కించుచు కాలం గడుపుతోంది.

కాల చక్రం యెవరేరీతిగా వున్నా ఆగదు. తన దారిని తాను తిరుగుచూ తన పనిని తాను నిర్వహించుకొంటూనే యుంటుంది.

రెండేండ్లు గడచినవి.

* * * *

ప్రస్తుతం భాస్కరరావు మద్రాసులో న్యాయవాదివృత్తిలో నున్నాడు. కమల భాస్కరుని భార్య అయిపోయింది. మరల యెప్పటి శోభ ఆ యిల్లాలిలో ప్రవేశించింది. ఇప్పటికీ కమల భాస్కరుని "బావా" అనే పిలుస్తుంది.